# అమెరికా విదేశాంగమంత్రి పర్యటన అమెరికా ఆధిపత్య ప్రణాళికకు దాసోహమన్న భారత్

**అమెరికా** విదేశాంగమంత్రి ఆష్టన్ కార్టర్ మూడు రోజుల భారత పర్యటనతో ఇరుదేశాల మధ్యనున్న సైనిక సంబంధాలు ఇంకా "లోతుగా" విస్తరించాయి. ఏప్రిల్ 12న చేసిన సంయుక్త ప్రకటనలో కార్టర్, మనోహర్ పారికర్‌లు యుద్ధతంత్ర మార్పిడి ఒప్పందాన్ని "సూత్రప్రాయంగా" వాషింగ్‌టన్, న్యూఢిల్లీలు అంగీకరించాయని తెలిపారు. దీనిప్రకారం అమెరికా సైన్యం సరఫరాలు, మరమత్తులు, విశ్రాంతి కొరకు భారత సైనిక స్థావరాలను వినియోగించు కునేందుకు వీలవుతుంది.

భారత అమెరికా సైనిక సంబంధాలు మరింత విస్తరించాలంటే "కొత్త ఆచరణాయుత యంత్రాంగం" అవసరమౌతుందని తెలిపారు. రాబోయే నెలల్లో యుద్ధతంత్ర మార్పిడి ఒప్పందం (లాజిస్టిక్ ఎక్స్ఛేంజ్ మెమోరాండం ఆఫ్ అగ్రిమెంట్) చేసుకోబోతున్నామనీ, దీని ముసాయిదా ఒక నెలలోపు తయారవుతుందనీ తెలిపారు.

భారత్‌కు, ప్రపంచానికీ కూడా సైనికంగా, వ్యూహాత్మకంగా ప్రమాదకరమైనది ఈ ఒప్పందం. భారత ప్రజలకు తెలియకుండా, కనీసం భారత్ పార్లమెంటుకు తెలుపకుండా బిజెపి ప్రభుత్వం ఈ ఒప్పందాన్ని చేసుకుంటున్నది. తద్వారా ప్రపంచ, ప్రత్యేకించి ఆసియాపై ఆధిపత్యం కొరకూ, చైనాను చుట్టివేసేందుకు, అవసరమనుకుంటే దానిపై యుద్ధంచేసేందుకు అమెరికా ఆధిపత్యవ్యూహంలో భారత్‌ను "ముందు పీఠీన" నిలిచేదిగా మార్చేందుకు బిజెపి ప్రభుత్వం పూనుకుంది. తమ ప్రాంతీయ ఆధిపత్య వాంఛలతో భారత పాలకవర్గాలు భారతదేశ ప్రయోజనాలను అమెరికా సామ్రాజ్యవాదపు ఆధిపత్య ప్రణాళికలకు బలిపెడుతున్నాయి.

ఇలా బలిపెట్టడం మొదటినుండీ జరుగు తున్నప్పటికీ, నూతన ఆర్థిక విధానాల అమలు నాటి నుండీ మరింత తీవ్రమైంది. భారత పాలకవర్గాలూ వాటి రాజకీయ ప్రతినిధులైన ఎన్‌డిఏ, యుపిఏలు అమెరికాతో వ్యూహాత్మక భాగస్వామ్య ఒప్పందాన్ని చేసుకున్నాయి. ఆ తర్వాతి దశాబ్దంన్నర పైగా కాలంలో అమెరికా యుద్ధశాఖ పెంటగాన్ నిర్వహించే యుద్ధ విన్యాసాలలో భారతసైన్యం భాగస్వామి అవుతున్నది. అమెరికాకు అతి పెద్ద ఆయుధ కొనుగోలుదారు అయింది. మలక్కా జలసంధిలో జరిగే వాణిజ్య సరుకుల నౌకారవాణాకు భారత నావికా సైన్యం భద్రతాదారు అయ్యింది. 2011లో "ఆసియా పివోటి" విధానాన్ని రూపొందించుకున్న నాటినుండి అమెరికా ఆధిపత్య వ్యూహంలోకి భారత్‌ను లాగేందుకు భారత పాలకులపై ఒత్తిడిని పెంచింది. మోడీ అధికార పగ్గాలు చేపట్టిన నాటినుండి అమెరికా సైనిక వ్యూహంలో భారత్‌ను కలిపేందుకు దూకుడుగా వ్యవహరిస్తున్నాడు.

బిజెపి రెండేళ్ల పాలనలో ఈ క్రమాన్ని త్వరిత పరిచారు. 'ఆసియా, పసిఫిక్ ప్రాంత, హిందూ మహా సముద్ర అమెరికా-భారత్‌ల సంయుక్త వ్యూహదార్శనిక' ఒప్పందాన్ని చేసుకున్నారు. దీనితో దక్షిణ చైనా సముద్రంలో అమెరికా లక్ష్యాన్ని అంగీకరించి నట్లయింది. 2015 శ్రీలంక అధ్యక్ష ఎన్నికల్లో అమెరికా సాగించిన ప్రభుత్వమార్పిడి యత్నాలకు సహాయపడింది. వార్షిక అమెరికా భారత్‌ల సంయుక్త నావికా విన్యాసాలలో జపానుకు స్థానమిచ్చింది. ఇటీవలి విశాఖలో అంతర్జాతీయ నౌకా విన్యాసాలకు జపాన్‌ను అనుమతించింది. అమెరికాయొక్క ఆసియా పివోటి విధానంలో ప్రధాన భాగస్వాములైన జపాన్, ఆస్ట్రేలియా లతో భారత్ తన సంబంధాలను విస్తరించింది.

అమెరికా-భారత్‌ల మధ్య "రక్షణ సాంకేతికత, వాణిజ్య చొరవ" అన్న విధానాన్ని మోడీ ప్రభుత్వం ముందుకు తెచ్చింది. దీనిద్వారా అమెరికా గుత్తపెట్టుబడి అత్యాధునిక ఆయుధాలను భారత పెట్టుబడిదారులతో కలిసి తయారుచేయటం, అభివృద్ధిచేయటం సాధ్య మౌతుంది. అయితే దీనిలో అమెరికా అసలు లక్ష్యం తన ఆయుధాలు, సాంకేతికతపై భారత సైనిక అవసరాలు ఆధారపడేట్లుగా మలచటమే. మోడీ "భారత్‌లో తయారీ" నినాదం దీనిని కప్పిపుచ్చేందుకు యిచ్చినదే.

భారత అమెరికాల మధ్య త్వరితగతిన విస్తరిస్తున్న సైనిక సంబంధాల నేపథ్యంలోనే యుద్ధతంత్రమార్పిడి ఒప్పందం ప్రాధాన్యతనూ ప్రమాదాన్నీ గుర్తించగలం. భారత, అమెరికా ప్రతినిధులిరువురూ ఈ ప్రమాదాన్ని తగ్గించి చూపేందుకు పూనుకున్నారు. భారత ప్రజలు దీనిని వ్యతిరేకిస్తారన్న భయం వారికుంది.

అమెరికా, పెంటగాన్‌లు ఇతర దేశాలతో సాధారణంగా యుద్ధతంత్ర మద్దతు ఒప్పందాలు చేసుకుంటాయి. వాటితో ఆయా దేశాల్లోని స్థావరాలను అమెరికా సైన్యం వినియోగించుకుంటుంది. అమెరికా చేసే యుద్ధాలలో అవి పాల్గొంటాయి. తాము చేసుకోబోతున్న ఒప్పందం, మద్దతు ఒప్పందాలకంటే భిన్నమైనదని కార్టర్, పారికర్‌లిరువురు వివరించారు. అది పరిస్థితిని బట్టి వుంటుందనీ, అమెరికా విజ్ఞప్తిని తిరస్కరించే హక్కు భారత్‌కు వుంటుందని తెలిపారు. ఒకవేళ అమెరికా గనుక ఒక యుద్ధంలోకి దిగితే, భారత స్థావరాలను అమెరికాసైన్యం వినియోగించుకొని తీరే షరతు లేదని వారు తెలిపారు.

ఇక్కడ "ఒకవేళ" అన్నదే లేదు. 2001 నాటి నుండి మధ్య ప్రాచ్యంలోనూ, ఉత్తర ఆఫ్రికాలోనూ ఇప్పటికీ అమెరికా దురాక్రమణ యుద్ధాలు సాగిస్తున్నది. భారత నౌకా స్థావరాలనూ, సైనిక స్థావరాలనూ అమెరికా సైన్యం వినియోగించుకోవటానికి ఇప్పుడు అనుమతించటమంటే (సరఫరాలు, మరమత్తులు, విశ్రాంతి కొరకు) ఆ యుద్ధాలలో అమెరికాకు భారత్ సాయపడటమే అవుతుంది. అలాగే అమెరికా స్థావరాలను భారత సైన్యం వినియోగించుకునే వీలు అనే సూత్రం అమలుకు అవకాశమేలేదు.

అదే ఊపులో భారత్‌లో అమెరికా సైన్యాలను నిలిపివుంచేయటం తమ లక్ష్యంకాదు అని కార్టర్ నొక్కి చెప్పాడు. అయితే "ఇరు సైన్యాలు కలిసి వ్యవహ రించటం రోజువారీ వ్యవహారంగానూ, ఆటోమాటిక్‌గా జరిగేదిగానూ చేయటం కోసమే"నట! అమెరికా సైన్యం భారత్‌లో విడిది చేయటంపై రాజకీయ నిర్ణయం అవసరంలేకుండా చేస్తారు. రోజువారీ పనిగా సాగిపోతుంది. కార్టర్ ఇక్కడితో ఆగలేదు. భారత్‌లోకి అమెరికా సైన్యాన్ని పంపించటం ఒక నిర్దిష్ట కర్తవ్యం కోసం, మానవీయ సహాయంకోసం జరుగుతుందని చెప్పాడు. ఆయన మాటల్లో "భూకంపం లేదా మరో ప్రకృతి వైపరీత్యం వంటి ఒక పరిస్థితి తలెత్తినప్పుడు, వాటిని ఎదుర్కొనేందుకు"నట!

భారత్ తరచుగా ప్రకృతి వైపరీత్యాలకు గురవుతున్నది. ఆ సమయంలో భారతసైన్యం సహాయ చర్యలలో పాల్గొంటున్నది. ఈ సహాయ చర్యలకోసం ఒక విదేశీ సైన్యం, అందునా ఒక ఒప్పందంద్వారా, రావాల్సిన అవసరమేమీ లేదు. ప్రజలకన్ను గప్పేందుకు ఇదొక సాకు మాత్రమేనని ఎవరికైనా అర్థమౌతుంది.

మానవీయ కర్తవ్యం – వినటానికి అందంగా వుంటుంది. ఈ సాకు చూపేకదా అమెరికా సైన్యం ఇథియోపియాపై దురాక్రమణ సాగించింది?! ఈ సాకుతోనే కదా, లిబియాపై దురాక్రమణ సాగించింది?! అమెరికా విధించిన ఆంక్షలవల్ల మందులు లేక ఇరాక్‌లో ఐదులక్షల పసిపిల్లలు మరణించగా, కువైట్ ఆస్పత్రులనుండి వెంటిలేటర్లు (కృత్రిమశ్వాస యంత్రాలు) ఎత్తుకుపోయాడంటూ సద్దాంపై తప్పుడు ప్రచారంచేసి ఇరాక్‌పై దురాక్రమణకు మానవీయ సాకును చూపలేదా?!

యుద్ధతంత్ర మార్పిడి ఒప్పందంపై సంతకాలు జరిగితే, అమెరికా ఎప్పుడు కోరుకుంటే అప్పుడు భారత్‌లోకి అమెరికా సైన్యం ప్రవేశించేందుకు గేట్లు బార్లా తెరిచినట్లవుతుంది.

యుద్ధనౌకలను సేకరించుకునే భారత పథకాలకు కార్టర్ మద్దతు తెలిపాడు. ఎందుకంట? ఈ ప్రాంతంలో భారత్ “భద్రతా ఎగుమతిదారుగా” వుండాలని అమెరికా నమ్ముతున్నదట. సంయుక్త ప్రకటనలో ఇదే మళ్లీ చెప్పారు. “సముద్ర రవాణా భద్రత ప్రాధాన్యతనూ, దక్షిణచైనా సముద్రంతో సహా భారత–ఫసిఫిక్ ప్రాంత మంతటా నౌకా, విమానయానాలకు స్వేచ్ఛను కాపాడటాలపట్ల నిబద్ధతను పునరుద్ఘాటిస్తున్నాము”. ఇది ఈ ప్రాంతంలో అమెరికా విధానాన్ని చిలక పలుకుల్లా వల్లించటమే. ఇది చైనాను ఈ ప్రాంతంలో దురాక్రమణదారుగా చిత్రిస్తున్నది. వాస్తవానికి దక్షిణ చైనా సముద్రం మాదంటూ వివాదాలు రేపమని ఆ ప్రాంత దేశాధినేతలను ప్రోత్సహించింది, అమెరికా సామ్రాజ్యవాదులే. వాణిజ్య స్వేచ్ఛ సాగటంగా అమెరికా దీనిని చిత్రిస్తున్నప్పటికీ, దీని అసలు లక్ష్యం చైనా సముద్రతీరాలకు తన యుద్ధనౌకలు త్వరితంగా చేరేందుకు ఆటంకాలు లేకుండా చేసుకోవటమే.

కార్టర్ పర్యటనలో భాగంగా లాక్‌హీడ్‌మార్టిన్ తయారీచేసే ఎఫ్–16 యుద్ధవిమానాల అమ్మకాలకూ, బోయింగ్ తయారుచేసే ఎఫ్/ఏ18 విమానాల అమ్మకాలకూ చర్చలు జరిపాడు. ఇరుదేశాల అధికారులు సముద్రమార్గాల భద్రతపై చర్చలు జరిపేందుకు అంగీకరించారు. జలాంతర్గాములను విధ్వంసంచేసే యుద్ధతంత్రంకోసం ఇరు నావికా సైన్యాధికారులమధ్య చర్చలకు అంగీకరించారు. యుద్ధ విమానవాహక నౌక నిర్మాణానికీ, యుద్ధవిమానాలు నిట్టనిలువుగా పైకిలేవగల అమెరికా సాంకేతికతను భారత్‌కందించటానికీ చర్చలు సాగాయి.

భారత్ ప్రపంచంలో అతి పెద్ద ఆయుధ దిగుమతి దారుగా వుంది. ఈ దిగుమతుల్లో 70శాతం రష్యా నుండి సాగుతున్నాయి. స్టాక్‌హోమ్ అంతర్జాతీయ శాంతి పరిశోధనాసంస్థ (సిప్రి) నివేదిక ప్రకారం ప్రపంచంలో జరిగే ఆయుధ దిగుమతుల్లో 14శాతం భారత్ చేసుకుంటున్నవే. ఇది పొరుగునున్న చైనా, పాకిస్తాన్‌లకంటే మూడురెట్లు ఎక్కువ. భారత్‌కు పెద్ద ఆయుధ సరఫరాదారుగా అమెరికా ఇటీవల ముందు కొచ్చింది. 2006–2010 నాటితో పోలిస్తే 2011–15 కాలంలో అమెరికానుండి ఆయుధ దిగుమతులు 11 రెట్లు పెరిగాయి. అయినప్పటికీ సమీప భవిష్యత్తు వరకూ, రష్యా ప్రధాన ఆయుధసరఫరాదారుగా వుండబోతున్నదని సిప్రి నివేదిక తెలిపింది.

అమెరికా ఆయుధ సరఫరాలపై భారతసైన్యం ఆధారపడటాన్ని పెంచేవిధంగానూ, అమెరికాను వెన్నంటి యుద్ధాల్లోకి వెళ్లే విధంగానూ, యుద్ధతంత్ర మార్పిడి ఒప్పందాన్ని రూపొందిస్తారు.

గతంలో భారత పాలకవర్గాలు రష్యా సోషల్ సామ్రాజ్యవాదంతో సైనిక సహకార ఒప్పందం చేసుకున్నాయి. వెంటనే తూర్పుపాకిస్తాన్‌ను “విముక్తి” చేసి బంగ్లాదేశ్‌ను ఏర్పాటుచేశాయి. రెండు అగ్రరాజ్యాల పోటీలో రష్యా పనుపున శ్రీలంక ఆంతరంగిక వ్యవహారాలలో జోక్యం చేసుకున్నారు. సోషల్ సామ్రాజ్యవాదం 1990లో కూలిపోవటంతో, ఆ ఒప్పందం కాలవ్యవధి తీరిపోవటాన్ని అనుమతించారు. ఇప్పుడు అమెరికాతో ప్రతిపాదించిన ఒప్పందం ఇలాంటి స్వభావాన్నే సంతరించుకుంటుంది.

రాబోయే నెలలో ఈ ఒప్పందంపై సంతకాలు జరగబోతున్నాయి. ఇది అమెరికా సాగించే దురాక్రమణల్లో భారత్‌ను జూనియర్ భాగస్వామిని చేస్తుంది. అమెరికా సామ్రాజ్యవాదంపై భారత సైనిక పరాధీనతను పెంచివేస్తుంది. ఈ వాస్తవాలనుండి ప్రజల దృష్టిమళ్లించేందుకు భారత పాలకవర్గాలు పొరుగుదేశాలకు వ్యతిరేకంగా జాతీయోన్మాదాన్ని రెచ్చగొడతాయి.

దీనిని ఆపాలి. ప్రజాస్వామిక, శాంతికాముక ప్రజలు, శక్తులు చేతులు కలిపి తమనిరసనను తెలపాలి. భారత ప్రయోజనాలను అమెరికా సైనిక వ్యూహానికి లోబర్చే విధానాన్ని ఖండించి, దానినుండి వెనక్కు వచ్చేవిధంగా భారత పాలకులపై ఒత్తిడి తేవాలి.

ooooo